క్లుప్తంగా

రూ.20 వేల ఆర్థికసాయం



పెద్దన్నను పరామర్శిస్తున్న దద్దాల నారాయణ

కనిగిరి రూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడి స్థానిక హర్షిత ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వెలిగండ్ల మండలం గుమ్మలకర్రకు చెందిన పార్టీ కార్యకర్త పొల్లెబోయిన పెద్ద గురవయ్యను వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్ గురువారం పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వైద్య ఖర్చుల నిమిత్తం రూ.20 వేల ఆర్థికసాయం అందజేశారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. నాయకులు కటికల వెంకట రత్నం, స్వర్ణ ఏడుకొండలు రెడ్డి, వాకుమళ్ల రాజశేఖరరెడ్డి, ముక్కు వెంకటేశ్వరరెడ్డి, ముక్కు మహేశ్వర్ రెడ్డి, మర్రి కొండయ్య, నారాయణ పాల్గొన్నారు.

భైరవకోనలో పూజలు



భైరవకోనలో పూజల్లో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నాయకులు, భక్తులు

సీఎస్‌పురం(పామూరు): ప్రముఖ పుణ్యక్షేత్రం, పర్యాటక ప్రాంతం భైరవకోనకు గురువారం సందర్శకులు, భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. క్షేత్రంలో జలపాతం ఉధృతి దృష్ట్యా ఆలయాల్లో సందర్శనకు, పూజలకు ప్రత్యేక రక్షణ చర్యలు చేపట్టి పరిమిత సంఖ్యలో దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా త్రిముఖదుర్గాదేవి, భర్గులేశ్వర, కాలభైరవ, నగరేశ్వర ఆలయాల్లో వైఎస్సార్ సీపీ నాయకులు వైస్ ఎంపీపీ భూమిరెడ్డి ప్రభంజనావెంకటరెడ్డి, ముత్యాల నారాయణరెడ్డి, గూడపురెడ్డి రమణారెడ్డి, రామిరెడ్డి, పలువురు నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

శనగ విత్తనాలకు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి



రైతులకు సూచనలిస్తున్న ఏఓ వెంకటేష్

మర్రిపూడి: శనగ విత్తనాలు కావాల్సిన రైతులు ముందుగా స్థానిక రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని వ్యవసాయాధికారి సీహెచ్ వెంకటేష్ తెలిపారు. మండలంలోని పన్నూరు, వల్లాయపాలెం గ్రామాల్లో గురువారం పొలం పిలుస్తోంది నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో నీరు నిలబడకుండా చూసుకోవాలని సూచించారు. వ్యవసాయ సహాయకుడు కె.రవిచంద్రారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఏటీఎంలను పరిశీలించిన ఎస్సై

కనిగిరి రూరల్: పట్టణంలోని పలు బ్యాంకులు, ఏటీఎంలను ఎస్సై టీ శ్రీరాం గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా బ్యాంక్ అధికారులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తల గురించి వివరించారు.

22 మద్యం బాటిళ్లు స్వాధీనం




స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లతో ఎస్సై

పామూరు: అక్రమంగా మద్యం తరలిస్తున్న మహిళను అరెస్టు చేసి ఆమె వద్ద నుంచి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై టి.కిషోర్ బాబు తెలిపారు. పామూరు జాతీయ రహదారి 565 వద్ద మహిళ మద్యం తరలిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు దాడులు నిర్వహించగా 22 మద్యం బాటిళ్లు కలిగి ఉండి వాటిని తరలించేందుకు ఆటో కోసం వేచి ఉండగా ఆమెను అరెస్టు చేసి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

దళితుల హక్కులు హరిస్తున్న ప్రభుత్వం

కనిగిరి రూరల్: రాష్ట్రంలో దళితులకు తీవ్ర మోసం, అన్యాయం జరుగుతుందని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి పందిటి మోహన్ అన్నారు. మండలంలోని పేరం గుడిపల్లిలో గురువారం దళిత హక్కుల పోరాట సమితి అధ్వర్యంలో జెండా ఆవిష్కరణ, సభ నిర్వహించారు. దళితుల ఓట్లతో గద్దెనెక్కిన కూటమి సర్కార్ వారి హక్కులను హరిస్తోందని తీవ్రంగా మండిపడ్డారు. బీకేఎంయూ నియోజకవర్గ కార్యదర్శి జీపీ రామారావు, నేలటూరి సాల్మన్, నేలపాటి అబ్రహ్మం, నేలటూరి దేవయ్య పాల్గొన్నారు.

కంది రైతుకు కష్టకాలం



కంది పైరు



కంది చేలో ఆగిన నీరు

- భారీ వర్షాలకు ఉరకెత్తనున్న పైరు
- రైతుల్లో ఆందోళన
- రైతులు జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయాధికారుల సూచన

కనిగిరి రూరల్: జిల్లాలో అత్యధికంగా కంది సాగు చేసే నియోజకవర్గాల్లో కనిగిరి ఒకటి. వ్యవసాయ అధికారుల నివేదికల ప్రకారం కనిగిరి, మార్కాపురం, దర్శి నియోజకవర్గాల్లో ఎక్కువగా కంది సాగు చేస్తారు. కనిగిరి ప్రాంతంలో సాగు నీటి వనరులు తక్కువగా ఉండటంతో ఎక్కువ శాతం రైతులు కంది పైరునే సాగు చేస్తారు. ఖరీఫ్, లేట్ ఖరీఫ్, రబీ సీజనల్‌లలో కూడా వ్యవసాయ సబ్ డివిజన్‌లోని ఆరు మండలాల్లో కంది సాగు చేశారు. ప్రస్తుతం కనిగిరి వ్యవసాయ డివిజన్‌లో సాధారణ విస్తీర్ణం 20,928 హెక్టార్లు కాగా నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో సుమారు 17,627 వేల హెక్టార్లు ఖరీఫ్ సీజన్‌లోని పంటలు సాగులో ఉన్నాయి. అయితే వాటిలో కంది పైరు అత్యధికంగా 5,477 హెక్టార్లు సాగు చేశారు. కనిగిరి మండలంలో 6,217 హెక్టార్లు, పామూరులో 1,266 హెక్టార్లు, వెలిగండ్ల లో 2,422 హెక్టార్లు, హెచ్‌ఎంపాడులో 295 హెక్టార్లు, సీఎస్‌పురంలో 569 హెక్టార్లు, పీసీపల్లిలో 4,718 హెక్టార్లు సాగు చేసినట్లు అధికారులు వెల్లడించారు. గత ఐదు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు కంది చేలల్లో నీరు చేరి పైరు ఉరకెత్తుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

కంది రైతులు జాగ్రత్తలు పాటించాలి: వెంకట రమణ, ఏడీఏ



వెంకట రమణ

ప్రస్తుతం కనిగిరి నియోజకవర్గంలో కంది పైరు శాకియ దశలో ఉంది. ఎక్కడా, పూత దశకు రానందున ఈ వర్షం వల్ల కంది పైరు నష్టం లేదు. చాలా ప్రాంతాల్లో కంది చేనుల్లో మొక్కల వద్ద వర్షం నీరు నిల్వ ఉండటంతో కంది మొక్కలు ఉరకలెత్తే ప్రమాదం ఉందన్నారు. రైతులు తక్షణ చర్యగా పొలాల్లో నీరు నిల్వ ఉండకుండా కాలువల ద్వారా బయటకు పంపించాలి. నల్లరేగడి పొలాల్లోని కందికి ఎక్కువగా జాగ్రత్తలు, వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలి. పైరు ఆరిన తర్వాత 13-0-45 ఎరువును ఎకరాకు ఒక కేజీ 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. రైతులకు ఏమైనా సందేహాలు ఉంటే స్థానిక వ్యవసాయ అధికారుల సలహాలు తీసుకోవాలని తెలిపారు. గత ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కనిగిరి ప్రాంతంలో దెబ్బతిన్న పంటలను క్షేత్ర స్థాయిలో అధికారులు పరిశీలించారు. వెలిగండ్ల, సీఎస్‌పురం మండలాల్లో సుమారు 2 వేల హెక్టార్లతో సజ్జ పంట దెబ్బతిన్నట్లు అధికారులకు ప్రాథమిక నివేదిక ఇచ్చారు. మిగతా పంటలకు ఎటువంటి నష్టం వాటిల్లలేదు.

దెబ్బతిన్న పంటల పరిశీలన



కంకణంపాడులో సజ్జ పంటను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి



కూటాగుండ్లలో మొలకెత్తిన సజ్జపంటను పరిశీలిస్తున్న ఏఓ రమణారావు

వెలిగండ్ల: వర్షాలకు మండలంలోని కంకణంపాడులో రైతులు సాగు చేసిన సజ్జ పంట దెబ్బతిందని వ్యవసాయాధికారులు తెలిపారు. మండల ప్రత్యేకాధికారి అర్జున్‌నాయక్, ఎంపీడీఓ ఒంగోలు అన్నమ్మ, తహసీల్దార్ సువర్ణ, ఏడీఏ ఈవీ రమణ, ఏఓ రంగకృష్ణ గురువారం దెబ్బతిన్న సజ్జ పంటను పరిశీలించారు. సజ్జ కంకులపై గింజ రంగు మారిపోయి నల్లని శిలీంద్రాలు ఏర్పడటం గమనించారు. కొన్ని సజ్జ కంకులపై గింజ మొలకెత్తడం గమనించారు. కోతకోసి కుప్పలుగా వేసిన కంకులలో మొలకశాతం ఎక్కువగా ఉందని గమనించారు. రైతు సమస్యలను పరిష్కరించాలని మండల ప్రత్యేకాధికారి అర్జున్ నాయక్‌ను కోరారు. తడచిన ధాన్యం, రంగుమారిన గింజలను ప్రభుత్వం మద్దతు ధర ప్రకారం కొనుగోలు చేసి తమను ఆదుకోవాలన్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను త్వరగా ఏర్పాటు చేయాలని రైతులు కోరారు.

హనుమంతునిపాడు: భారీ వర్షాలకు మండలంలోని పలు గ్రామాల్లో కోతకొచ్చిన సజ్జ, సాగులో ఉన్న మినుము, అలసంద, వేరుశనగ పంటలు దెబ్బతిన్నాయి. ఏఓ రమణారావు, వీఏఏలు దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరారు. అధికారుల లెక్కల ప్రకారం మండలంలో సజ్జ 1212 ఎకరాల్లో, వరి 243 ఎకరాలు, మినుము 2072 ఎకరాలు, అలసంద 625 ఎకరాలు, కంది 814 ఎకరాలు, వేరుశనగ 445 ఎకరాలు, మిరప 100 ఎకరాలు, పొగాకు 225 ఎకరాల్లో సాగు చేశారు. నీటి మినిగిన పొగాకు,మినుము, అలసంద, మిరప ఉరక వేస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



వగ్గంపల్లెలో మిరప పైరును పరిశీలిస్తున్న హెచ్‌ఓ కుసుమ

పామూరు: అధిక వర్షాలు కురుస్తున్న దృష్ట్యా మిర్చి రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల ఉద్యానవన శాఖాధికారి కె.కుసుమ అన్నారు. ఇటీవల వర్షాలకు మండలంలోని వగ్గంపల్లెలో మిరప పైరులో నీరు నిల్వ ఉన్న ప్రాంతాన్ని హెచ్‌ఓ గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అధికంగా ఉన్న నిల్వ నీటిని బయటకు పోయేలా జాగ్రత్తలు వహించాలన్నారు. ఉరకెత్తిన పొలాల్లో మొక్కలు వెంటనే తేరుకోవడానికి లీటరు నీటికి 10 గ్రాములు యూరియా, 10 గ్రాములు పంచదార కలిపిన ద్రావణాన్ని వారం రోజుల వ్యవధిలో రెండుమార్లు పిచికారీ చేయాలన్నారు. బత్తాయి పొలాల్లో నీరు నిల్వ ఉంటే తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు.

స్వామి దర్శనం పరమ పవిత్రం



మాలకొండ దేవాలయం



దేవాలయ ఆవరణలో రేకుల షెడ్లు

- భక్తుల ఇలవేల్పుగా మాలకొండ స్వామి
- వైఎస్సార్ సీపీ హయాంలో దేవస్థానానికి సకల సౌకర్యాల కల్పన

వలేటివారిపాలెం:

మండలంలోని మాలకొండ గ్రామంలో వెలసిన శ్రీ మాల్యాద్రి లక్ష్మీనరసింహ స్వామి వారి దేవస్థానం భక్తుల కొంగు బంగారంగా మారింది. స్వామిని దర్శించుకుంటే ఎలాంటి కోర్కెలైనా తీరుతాయనే నమ్మకంతో వేలాదిగా భక్త జనం తరలి వస్తుంటారు. ఈ నేపథ్యంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఆలయానికి నూతన శోభ తీసుకొచ్చింది. కోట్లాది రూపాయలతో భక్తుల సౌకర్యార్థం అనేక వసతులు కల్పించింది. కానీ నేటి కూటమి ప్రభుత్వం నిర్వహణ విషయంలో శీతకన్ను వేయడంతో భక్తులు ఆవేదన చెందుతున్నారు.

దశాబ్దాల క్రితం వసతుల లేమి

ఆలయ ప్రాశస్త్యం మొదటి నుంచి ప్రతి శనివారం దైవ దర్శనం భక్తులకు ఉండేది. దట్టమైన అటవీ ప్రాంతంలో స్వామివారు కొలువై ఉండేవారు. స్థానిక పురాణాల ప్రకారం మిగతా రోజుల్లో మునులు, దేవతలు స్వామికి పూజలు చేసేవారట. కాగా 1952 నుంచి 2019 వరకు దేవాలయంలో ఉన్న సిబ్బందికి మాత్రమే భోజన వసతులు ఆలయ అధికారులు ఏర్పాటు చేసేవారు. సుమారు 200 నుంచి 300 మంది వరకే అన్నదానం అందేది. దీంతో గతంలో భక్తులు ఇంటి దగ్గర నుంచే భోజనం తీసుకొని దర్శనానంతరం భోజనం చేసి వారి స్వగ్రామాలకు తిరుగు ప్రయాణం అయ్యేవారు.

దార్శనిక పాలనలో మెరుగైన వసతులు

- 2019లో ఏర్పడిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మాలకొండ స్వరూపాన్ని పూర్తిగా మార్చేసింది. ఉదయం 6.00 గంటల నుంచి 10.00 గంటల వరకు ప్రతి భక్తునికీ అల్పాహారం ప్రారంభించింది.
- ఉదయం 10.45 నుంచి మధ్యాహ్నం 3.00 గంటల వరకు దాదాపు 7 వేల మందికి దేవస్థానం తరఫున ఉచిత భోజన వసతులు ఏర్పాటు చేసింది.
- అన్నం వండటం కోసమే 5 లక్షల రూపాయల నిధులతో స్టీమ్ ఏర్పాటు చేశారు.
- 2019కు ముందు దేవాలయ ఆవరణలో వేసవి కాలంలో తాటాకు పందిర్లు వేసేవారు. కానీ ఆ తర్వాత భక్తులను ఎండ నుంచి రక్షించడానికి సుమారు రూ. 2 కోట్ల వ్యయంతో రేకులు షెడ్లు వేసి శాశ్వత పరిష్కారం చూపారు.
- గతంలో గొడుగు రాయి కింద పొంగళ్లు పెట్టుకుంటుండగా.. ప్రస్తుతం రూ. 5 లక్షలతో పొంగళ్లు పెట్టుకోవడానికి గదులు నిర్మించారు.
- కొండపై ఉన్న కల్యాణ మండపం తూర్పున 2 కోట్ల వ్యయంతో వాహదారులకు ఇబ్బందులు లేకుండా రక్షణ గోడ నిర్మించారు.
- దర్శనం, కళ్యాణ కట్ట, లడ్డూలు తీసుకొనేందుకు ఇబ్బందులు లేకుండా వీలుగా.. స్టీల్ క్యూలైన్లను రూ. 50 లక్షలతో నిర్మించారు.
- పురుష, స్త్రీల భక్తులకు 24 గదులతో కూడిన మరుగు దొడ్లను రూ. 40 లక్షలతో నిర్మించారు.
- దైవ ప్రసాదమైన లడ్డూ తయారు చేయడానికి 60 లక్షలతో నూతన భవనం ఏర్పాటు చేశారు.
- కొండ కింద దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల వసతుల కోసం 56 గదులతో కూడిన వసతి భవనం 1కోటి 25 లక్షల వ్యయంతో నిర్మించారు.
- గత 60 సంవత్సరాల నుంచి భక్తులు కాలినడకతో శిథిలావస్థలో చేరిన 1001 మెట్లు ఎక్కి దేవస్థానం చేరుకునేవారు. కానీ 2023 నుంచి రూ. 5 కోట్లు నిధులతో తిరుపతి దేవస్థానం అలిపిరి మెట్లు నమూన పద్ధతిలో శిథిలావస్థలో ఉన్న మెట్లను తొలగించి నూతన మెట్లు నిర్మించే ప్రక్రియ చివరి దశకు చేరుకుంది.
- 2019–2023 వరకు సుమారు రూ. 10 కోట్లతో దేవాలయం అభివృద్ధి చెందడానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కృషి చేయగా.. ఇదే కాలంలో వివిధ బ్యాంకుల్లో దేవాలయం నగదు రూ. 15 కోట్లకు చేరుకోవడం విశేషం.

నేడు ఫ్యాన్లు కూడా వేయలేరు

అన్నదాన భవనంలో భక్తుల భోజనం చేసే సమయంలో గత ప్రభుత్వం ఫ్యాను ఏర్పాటు చేసింది. కానీ వాటిని వేయడాని కూడా నేటి ప్రభుత్వానికి తీరిక దొరకడంలేదు. అలాగే దర్శన మార్గంలో ఉన్న ఫ్యాన్లను కూడా ఉపయోగించికపోవడంతో భక్తులు ఇబ్బంది పడుతున్నారు.

దేవుని పేరుతో ప్రభుత్వ స్థలం ఆక్రమణకు యత్నం

సింగరాయకొండ(కొండపి): దేవుడి పేరుతో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నించారు. వివరాల్లోకి వెళితే.. దసరా పండుగను పురస్కరించుకొని జనసేన మండల నాయకుడు ఖాజా హుస్సేన్ మూలగుంటపాడు పంచాయతీ పరిధిలోని కో ఆపరేటివ్ సొసైటీలో విగ్రహం ఏర్పాటు చేసి పూజలు చేశారు. పండుగ పూర్తయినా విగ్రహాన్ని తొలగించకుండా..విగ్రహానికి శాశ్వత ప్రాతిపదికన రేకుల షెడ్డు నిర్మించాడు. ఈ విషయం తెలియడంతో జిల్లా కో ఆపరేటివ్ సొసైటీ అధికారి చంద్రనాథ్ స్వయంగా వచ్చి ప్రభుత్వం స్థలంలో ఏర్పాటు చేసిన విగ్రహాన్ని తొలగించి స్థలాన్ని స్వాధీనం చేసుకున్నారు.

పండ్లతోటల పెంపకంపై దృష్టి సారించాలి



మర్రిపూడిలో బత్తాయి మొక్కలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ జగదీష్

మర్రిపూడి: రైతులు పండ్ల తోటల పెంపకంపై దృష్టి సారించాలని ఎంపీడీఓ ఎస్ జగదీష్ అన్నారు. స్థానిక కొండపాలంలో ఉపాధి హామీ పథకంలో పసుకూరి నరసింహారావు నాటుకున్న బత్తాయి తోటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు మొక్కలు బాగా ఎదుగుతాయన్నారు. అయితే మొక్కల చుట్టూ పాదులు చేసుకుని నీరు నిలబడేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సేంద్రియ ఎరువులు వాడుకుని, రుచికరమైన పండ్లను కొనుగోలుదారులకు అందించాలన్నారు. ఉపాధి హామీ పథకంలో పండ్ల తోటలు పెంచుకునేందుకు ఆసక్తి ఉన్న సన్న, చిన్నకారు రైతులు ప్రభుత్వం అందించే సబ్సిడీ పొందాలని సూచించారు. ఆయన వెంట ఏపీఎం రాంబాబు, రైతులు, ఉపాధి సిబ్బంది ఉన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన



శిలాఫలకాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి

పీసీపల్లి: మండల పరిధిలో పలు సీసీ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి గురువారం శంకుస్థాపనచేశారు. ఈ సందర్భంగా ఆయన నేరేడుపల్లిలో రూ.20 లక్షలు, జంగాలపల్లిలో రూ.15 లక్షలు, పీసీపల్లిలో రూ.1.90 కోట్లతో నిర్మించనున్న రోడ్లకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయం చిన్నపాటి వర్షానికే జలమయమవుతుందని ఆయన దృష్టికి తీసుకువెళ్లగా సచివాలయానికి గానీ, రైతు సేవా కేంద్రానికి వెళ్లి పనులకు ఆటంకం లేకుండా నిర్వహించాలన్నారు. అనంతరం ఇటీవల ముంబై ఆంధ్ర మహాసభల అధ్యక్షునిగా ఎన్నికైన మాదిరెడ్డి కొండారెడ్డిని సన్మానించారు.

సీఎస్‌పురం(పామూరు): మండలంలో రూ.3 కోట్ల ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మించనున్న 13 సీసీ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి భూమిపూజ చేశారు. తహసీల్దార్ మంజునాథ రెడ్డి, ఎంపీడీఓ షేక్.ఖాదర్‌బీ, ఏపీఓ వాక్యవతి, సర్పంచ్ శ్రీరామ పద్మావతి, ఉపసర్పంచ్ పాములపాటి నరసయ్య, పీఎస్ వి.బ్రహ్మానందరెడ్డి, జి.వాణి, నాయకులు పాల్గొన్నారు.

తప్పులు లేకుండా వివరాలు నమోదు చేయాలి



మాట్లాడుతున్న డిప్యూటీ డీఈఓ చంద్రమౌళేశ్వరరావు

కనిగిరి రూరల్: అన్ని ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ ఉన్నత పాఠశాలల్లో యుడైస్ లోని డేటా నమోదులో తప్పులు లేకుండా జాగ్రత్తలు పాటించాలని డిప్యూటీ డీఈఓ ఏ చంద్ర మౌళేశ్వర్‌రావు అన్నారు. స్థానిక ఎంఈఓ కార్యాలయ అవరణలో గురువారం అన్ని యాజమాన్య పాఠశాలల హెచ్‌ఎంల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు ఆపార్ నంబర్ జనరేట్ చేయడం, టీచ్ టూల్ పరిశీలన, సేఫ్టీఆడిట్ ఫామ్‌లు పంపడం గురించి వివరించారు. ఎంఈఓల సంఘ జిల్లా అధ్యక్షుడు దేవిరెడ్డి రామిరెడ్డి, ఎంఈఓలు డీవీ సుబ్బారావు, యువీ నారాయణరెడ్డి, జి.సంజీవి, రాజాల కొండారెడ్డి, రాచమడుగు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

శాంతించిన వరుణుడు



అనకర్లపూడి-మద్దులూరు మధ్య నెమ్మదించిన ముసివాగు

కొండపి: మండలంలో బుధవారం రాత్రి 8 గంటల నుంచి గురువారం రాత్రి 7 గంటల వరకు 11.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని తహసీల్దార్ పి.మురళి తెలిపారు. గత రెండు రోజుల్లో కురిసిన భారీ వర్షాలకు ఉప్పొంగిన వాగులు శాంతించాయి. కొండపి నుంచి పొదిలి, ఒంగోలు వెళ్లే దారులలో రాకపోకలు పునరుద్ధరించారు. అనకర్లపూడి మద్దులూరు మధ్య ఉన్న ముసి వాగు నెమ్మదించడంతో ప్రైవేట్ వాహనాల రాకపోకలు కొనసాగుతున్నాయి. ఆర్టీసీ బస్సులను ప్రస్తుతానికి నడపడం లేదు.

కనిగిరి రూరల్: కనిగిరి మండలంలో 8.8 మి.మీ, వెలిగండ్లలో 11.4, హెచ్‌ఎంపాడులో 15.0, పామూరులో 16.8, పీసీపల్లిలో 11.4, సీఎస్ పురంలో 32.4 వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.

ఘనంగా మహర్షి వాల్మీకి జయంతి



వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సంఘ నాయకులు, ఉపాధ్యాయులు

పామూరు: మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను వాల్మీకిసంఘం, వాల్మీకి ఉద్యోగులసంఘం ఆధ్వర్యంలో గురువారం స్థానిక ప్రభుత్వ ఉన్నతపాఠశాల వద్ద ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా వాల్మీకి చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. పాఠశాల హెచ్‌ఎం రామస్వామి, బోగ్యం బాలక్రిష్ణలు మాట్లాడుతూ వాల్మీకి మహోన్నత వ్యక్తిగా మారినతీరును యువత గ్రహించాలన్నారు. ప్రభుత్వ ఉన్నతపాఠశాల ఎస్ఎంసీ ఛైర్మన్ గుత్తి యేడుకొండలరావు, సుర్తినేని ప్రసాద్, నల్లబోతుల చెన్నానారాయణ, పిక్కిలి మస్తాన్ పాల్గొన్నారు.

డీఎస్సీ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

కొండపి: షెడ్యూల్ కులాలు, తెగల అభ్యర్థులు డీఎస్సీ పరీక్ష ఉచిత శిక్షణకు భోజనం, వసతి సౌకర్యాలతో మూడు నెలల పాటు శిక్షణకు ఈ నెల 21 లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కొండపి సాంఘిక సంక్షేమ శాఖ సహాయ అధికారి యుదానయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 22 నుంచి 25వ తేదీ లోగా హాల్‌టిక్కెట్ డౌన్‌లౌడ్ చేసుకోవాలని, 27వ తేదీ నిర్వహిస్తామన్నారు. మెరిట్ లిస్ట్ ప్రకటన 28వ తేదీ, జిల్లాల వారీగా ఎంపికైన వారి జాబితా 30వ తేదీన, కోచింగ్ సెంటర్ల వారీగా అభ్యర్థులు ఎంపిక నవంబర్ 3వ తేదీన, కోచింగ్ 6వ తేదీ నుంచి ప్రారంభమవుతుందన్నారు. ఎస్జీటీలకు ఇంటర్మీడియెట్‌తో పాటు డైట్, టెట్, స్కూల్ అసిస్టెంట్లకు డిగ్రీ గ్రాడ్యుయేషన్, బీఈడీ, టెట్ విద్యార్హతలు కలిగిన వారు అర్హులన్నారు. కుటుంబ వార్షికాదాయం రూ. 2.50 లక్షల లోపు కలిగిన ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు అర్హులన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం

లింగసముద్రం: అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై షేక్ మహబూబ్ సుభాని తెలిపారు. గురువారం తెల్లవారుజామున మండలంలోని అన్నెబోయినపల్లె వద్ద ఉన్న మన్నేరు వాగు నుంచి ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం అందింది. దీంతో సిబ్బందితో వెళ్లి అన్నెబోయినపల్లె గ్రామ శివార్లలో ఇసుక లోడుతో వెళుతున్న ట్రాక్టర్లను వెంబడించి దాడి చేసి పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.